క్లుప్తంగా

రేపు విజేత కళాశాలలో మెగా జాబ్ మేళా

మిర్యాలగూడ : పట్టణంలోని విజేత డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 18న ఎంఎస్ఎన్ లాబోరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ మంగళవారం తెలిపారు. పదో తరగతిలో 60శతం మార్కులు, ఇంటర్మీడియట్(ఎంపీసీ, బైపీసీ)లో 2022– 23 సంవత్సరంలో 55శాతం మార్కులు కలిగి 20 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన విద్యార్థిని, విద్యార్థులు అర్హులని తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే వారు పాస్‌ఫొటో, బయోడేటా, ఆధార్‌కార్డు జీరాక్స్, విద్యార్హతల సర్టిఫికెట్లను వెంట తీసుకురావాలన్నారు. కనీస వేతనం రూ.11వేలు, మొదటి రెండేళ్ల ఉచిత వసతి, వాహన సౌకర్యంతో పాటు డిగ్రీలో బీఎస్సీ గ్రూపులో చదివేవారికి సంస్థ రాయితీలు కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

మిర్యాలగూడ టౌన్ : డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం (నేడు) నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రజలు బస్సుల నిర్వాహణతో పాటు సలహాలు, సూచనలను ఉదయం 11 గంటల నుంచి 12గంటల వరకు సెల్ నంబరు–9959226308కి ఫోన్ చేయవచ్చన్నారు. ఏమైన సమస్యలు ఉన్న కూడా డయల్ యువర్ డీఎం ద్వారా తెలియజేయవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : రామడుగు, పులిమామిడి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు బుధవారం ఉదయం 08 గంటల నుంచి 12 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు హాలియా విద్యుత్ ఏఈ బాలు నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132/కేవీ ఈహెచ్‌టీ ఎర్రబెల్లి సబ్‌స్టేషన్ నుంచి 33కేవీ పులిమామిడి ఫీడర్ పరిధిలోని లేన్ల మీదుగా ఉన్న చెట్టు కొమ్మల తొలగింపు ఉన్నందున విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ, పరిశ్రమల వినియోగదారులు సహకరించగలరని తెలిపారు.

డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

వేములపల్లి : డెంగీ జ్వరాలు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సుచరిత అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా వేములపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డెంగీ నివారణపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఏడీఎస్ అనే దోమ కాటుతో డెంగీ వస్తుందని, వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున ప్రజల తమ పరిసరాలను, ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో స్వామి, పీహెచ్ఎన్ పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, జ్యోతి, ఎల్‌టీ శ్రీను, ఫార్మాసిస్ట్ శోభా, శ్రీధర్‌రెడ్డి, నాగమణి, వైద్య సిబ్బంది నరేందర్, శ్రీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు సన్మానం


హెడ్‌కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న క్రీడాకారులు

నాగార్జునసాగర్ : సాగర్‌ప్రాజెక్టు భద్రతలో విధులు నిర్వహించే ఎస్‌పీఎఫ్ (ప్రత్యేకరక్షణదళం)హెడ్‌కానిస్టేబుల్ ఆంజనేయులు బదిలీపై వెళ్తుండటంతో ఆయనను నందికొండ పైలాన్‌లోని కృష్ణా స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు వీడ్కోలు చెబుతూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాగర్ సర్కిల్ సీఐ బీసయ్య, ఎస్ఐ సురేష్, క్రీడాకారులు అలీబాబా, శ్రీనివాస్, సత్యనారాయణ, జావీద్‌పాషా, తాజోద్దీన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలి

దేవరకొండ : జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీసీ కులగణన చేపట్టి బీసీల రిజర్వేషన్లు పెంచుతామని రాయ్‌పూర్ కాంగ్రెస్ ప్లీనరీలో హామీ ఇచ్చినందుకే కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో మోదీ ప్రభుత్వం బీసీలకు చేసిందేమీ లేదన్నారు. ఈ సమావేశంలో బీసీ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు లింగంపల్లి మధు, రవిగౌడ్, చొల్లేటి భాస్కరాచారి పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం పరిశీలన

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళా కబడ్డీ పోటీలు క్రీడా ప్రాంగణాన్ని తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కర్తయ్య స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శాగం పెద్దిరెడ్డి, మండల చంద్రశేఖర్, శ్యాంసుందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ అంజయ్య పాల్గొన్నారు.

వేతన భారం పంచాయతీలపైనే!

- మల్టీపర్పస్ వర్కర్లకు రూ.వెయ్యి పెంచిన ప్రభుత్వం
- ప్రత్యేక నిధులు ఇవ్వకపోవడంతో సర్పంచ్‌ల అసంతృప్తి
- ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని వేడుకోలు



తిరుమలగిరి (నాగార్జునసాగర్) : గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు ప్రతి నెల రూ. వెయ్యి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామపంచాయతీ కరోబార్లు, కార్మిక వేతనాలు పెంచి ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి గతంలో వినతిపత్రాలు అందించాయి. దీంతో ప్రభుత్వం ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం ప్రారంభం సందర్భంగా సీఎం వారికి తీపి కబురు అందించారు. ఇప్పటి వరకు పంచాయతీ సిబ్బందికి నెలకు రూ. 8500 వేతనం చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం ఇక నుంచి వారికి రూ. 9500 చెల్లించనున్నారు. పెంచిన వేతనాన్ని చెల్లించే బాధ్యత పంచాయతీలపైనే భారం మోపింది. ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ ఇవ్వకపోవడంతో సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల ఆదాయం నామమాత్రంగానే ఉండగా పెంచిన వేతన భారం భారంగానే మారిందని వాపోతున్నారు. పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లు, ఎలక్ట్రీషియన్, డ్రైవర్లు, ఆపరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులందరిని మల్టీపర్పస్ కార్మికులుగా ప్రభుత్వం గుర్తించింది.

మండలంలో 800మంది కార్మికులు

మండలంలో మొత్తం 34 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో సుమారు 800 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆర్థిక సంఘం నిధుల నుంచి గతంలో జీతాల కోసం వినియోగించే వారు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం మార్గదర్శకాలను మార్చడంతో వేతనాల కోసం జీపీలు పన్నుల ఆదాయం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ విధులను వినియోగించేవి. ట్రెజరీ కార్యాలయాల ద్వారా వేతనాలను చెల్లించడానికి చెక్కులు పంపిస్తుండటం ఫ్రీజింగ్ కారణంగా చెక్కులు సకాలంలో చెల్లించకపోవడంతో వేతనాలు సకాలంలో చేతికందడటంలో జాప్యం జరుగుతోంది. పంచాయతీల కార్మికుల వేతనాల భారాన్ని ప్రభుత్వం మోస్తేనే పంచాయతీలకు ఇబ్బంది తప్పుతుందనే వాదన వినిపిస్తుంది. అంతేగాకుండా ప్రభుత్వం నిధుల నుంచి వేతనాలు చెల్లిస్తే ప్రతి నెల సకాలంలో తమ ఖాతాల్లో జీతాలు జమ అవుతాయని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు.

ప్రత్యేక నిధులు ఇవ్వాలి



ప్రభుత్వం ఇటీవల పెంచిన కార్మికుల వేతనాలు పంచాయతీలపై భారం పడనుంది. ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ ఇవ్వకుండా ఇలా పంచాయతీలపై భారం మోపడం సరికాదు. పంచాయతీలకు వచ్చే ఆదాయమే సరిపోక నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల జీతాలను ప్రత్యేక గ్రాంట్‌ను ఏర్పాటు చేసిన అందులో నుంచి ఇవ్వాలి.

– పెంకీసు పాపిరెడ్డి, అల్వాల సర్పంచ్

సీసీ కెమెరాలతో నేరాలు అదుపు


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శోభన్ బాబు

త్రిపురారం : సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపు చేయవచ్చని త్రిపురారం ఎస్ఐ శోభన్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని దుకాణదారులు, హోటళ్లు, షాపింగ్ మాల్‌ల నిర్వాహకులకు సీసీ కెమెరాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక్కో సీసీ కెమెరాల 100మందితో సమానమన్నారు. వీటిద్వారా దొంగతనాలు, దోపిడీలను అరికట్టవచ్చన్నారు. గ్రామాలు, మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, ప్రజలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీని విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గోవర్ధన్‌యాదవ్

దేవరకొండ : ఈనెల 20న నిర్వహించనున్న నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని యాదవసంఘం జిల్లా అధ్యక్షుడు బొడంగి గోవర్ధన్‌యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండ పట్టణంలో యాదవసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి యాదవులపై అసభ్య పదజాలంతో దూషించినందుకు నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల నుంచి క్లాక్‌టవర్ వరకు చేపట్టబోయే నిరసన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా యాదవులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. యాదవులంతా ఏకతాటిపైకి రావాలన్నారు. ఈ సమావేశంలో యాదవసంఘం నాయకులు నక్క వెంకటేష్ యాదవ్, నేతాళ్ల వెంకటేష్‌యాదవ్, ఈరటి బాలరాజ్, ధనుంజయ్, మాడెం రాములు, మల్లయ్య, యాదయ్య, వెంకట్, గురువయ్య పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్


దేవరకొండ : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి : ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని దేవరకొండ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం పెద్దఅడిశర్ల మండలంలోని గుడిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సీఎం కప్పు క్రీడా పోటీలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతరం గుడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పలు పార్టీలకు చెందిన నాయకులను ఆయన బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, స్థానిక సర్పంచ్ శీలం శేఖర్‌రెడ్డి, అర్వపల్లి నర్సింహ, యాదగిరి, సుధాకర్‌రెడ్డి , తదితరులు పాల్గొన్నారు

జాతీయస్థాయిలో రాణించాలి

దేవరకొండ : గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్–2023 క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ గోపిరాం, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీలు నల్లగాసు జాన్ యాదవ్, వంగాల ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ మారుపాకల అరుణసురేష్‌గౌడ్, ఎంపీడీఓ శర్మ, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, కమిషనర్ వెంకటయ్య, వల్లపురెడ్డి, ఎస్‌వీటీ, వ్యాయమ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

పట్టణంలోని ఆయూష్ కరాటే అకాడమీ విద్యార్థులు ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి గ్రాండ్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నట్లు అకాడమీ మాస్టర్ చైతన్య తెలిపారు. మంగళవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్ విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవరకొండ ప్రాంత విద్యార్థులు జాతీయస్థాయిలో సత్తా చాటడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య, రమేష్, ఏడుకొండలు, రాజు, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్.. నందికొండ మున్సిపాలిటీ


సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

నాగార్జునసాగర్ : అభివృద్ధికి కేరాఫ్‌గా నందికొండ మున్సిపాలిటీ మారిందని, 60ఏళ్లలో జరగని అభివృద్ధి రెండేళ్లలో జరిగిందని ఎమ్మెల్యే భగత్ అన్నారు. 'మన వార్డుకు మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా మంగళవారం నందికొండ మున్సిపాలిటీలోని హిల్‌కాలనీలో రూ.9కోట్లతో వేసిన సీసీరోడ్లను ప్రారంభించారు. అనంతరం 4, 5వార్డుల్లో గడప గడపకూ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 60ఏళ్లుగా ఎదురు చూస్తున్న నందికొండ వాసులకు కేసీఆర్ సొంతింటి కల నెరవేర్చాడన్నారు. ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.25కోట్లు వెచ్చించి తాగునీటి సమస్యతో పాటు మున్సిపాలిటీని అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాలనీలలోని నివాసులందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తున్న కేసీఆర్ మున్సిపాలిటీ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కాలనీలలో ప్రజలు తెలిపిన సమస్యలు పరిష్కరించేందుకు ఎన్నెస్పీ,మున్సిపాలిటీ అధికారులతో కౌన్సిలర్లతో కలిసి సమావేశం అయ్యారు. నిరుపేదలు ఉన్న చోట మహిళలకు,పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణం చేసేందుకు రూ.15లక్షలు మంజూరు చేశారు. అందులో వృద్ధులకు ప్రత్యేకంగా వెస్టర్న్ పద్ధతిలో ఒక్కొక్కటి నిర్మాణం చేయాలని సూచించారు. తాగునీటి కులాయిలు అడిగిన వారికి వారి అవసరాలను గుర్తించి మంజూరు చేయాలని, విద్యుత్ సమస్యలను తీర్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ జువాజి వెంకటేశం, వైస్ చైర్మన్ బిన్ని, స్థానిక నాయకులు కర్ణ బ్రహ్మానందరెడ్డి, మొద్దుకూరి రాంబాబు, వాసుదేవుల సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు రామకృష్ణ, రమేష్‌జీ, మంగ్తానాయక్, శరత్‌రెడ్డి, చంద్రమౌళి, కాటు కృష్ణ, కొండలు, మహిళానాయకులు జానకిరెడ్డి, మాధవి, విజయ్, మున్సిపాలిటీ కమిషనర్ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సైదులుగౌడ్, ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, ఎన్నెస్పీ డీఈ శ్రీనివాసరావు, ఏఈ బిక్షం తదితరులు పాల్గొన్నారు.

మీరు మారరా !

- వైద్యుల గైర్హాజరుపై అగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే భగత్


వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

డాక్టర్లను ప్రజలు దైవంతో సమానంగా ప్రాణాలు పోసే వారిగా చూస్తున్నారని, ఇప్పటికైనా మారాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భ భగత్‌కుమార్ డాక్టర్లకు సూచించారు. మంగళవారం నందికొండకు వచ్చిన ఆయన కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. హాజరుపట్టికను చూసి, కంప్యూటర్‌లో నిక్షిప్తమైన బయోమెట్రిక్ రికార్డులను పరిశీలించారు. ఒకే రోజు 8మంది డాక్టర్లు గైర్హాజరు కావడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం హాజరైన వారితో సమావేశమయ్యారు. ప్రభుత్వం ఆస్పత్రికి సౌకర్యాలు కల్పించిందని వాటితో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాని తెలిపారు. గతంతో పోలిస్తే ఓపి సేవలు పెరిగాయని డాక్టర్లు తెలపడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఏయో నెలలో ఎన్నెన్ని కాన్పులు జరిగాయే అడిగి తెలుసుకున్నారు. రోగులకు కలిసి వారికి అందుతున్న వైద్యం గురించి ఆరాతీశారు. డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో రోగుల కష్టాలు తొలిగినట్లు పేర్కొన్నారు.

దళితవాడ అభివృద్ధికి నిధులు కేటాయించాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వార్డు కౌన్సిలర్

హాలియా : మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డుకు మంజూరైన ఎస్‌డీఎఫ్ నిధులను దళితవాడ అభివృద్ధికి కేటాయించాలని కోరుతూ మంగళవారం మూడో వార్డు కౌన్సిలర్ అన్నెపాక శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి కి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నాగార్జున సాగర్ ఉప ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు హాలియా మున్సిపాలిటీకి ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయన్నారు. ఎస్‌డీఎఫ్ నిధులతో మూడో వార్డులోని దళితవాడలో 1008 మీటర్ల సీసీ రోడ్డు, 390 మీటర్ల సీసీ డ్రైయిన్లు చేపట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే నోముల భగత్ నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం మూడో వార్డుకు మంజూరైన ఎస్‌డీఎఫ్ నిధులను వేరే వార్డుకు కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆ నిధులను తక్షణమే దళితవాడకు కేటాయించి అభివృద్ధి పర్చాలని కౌన్సిలర్ శ్రీనివాస్ వినతిలో పేర్కొన్నారు.

ఆలయాల నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న పాండు రంగారెడ్డి

గుర్రంపోడు : మండలంలోని చామలేడు, కొప్పోలు, గుర్రంపోడు గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం, శివాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త, వైష్ణవి బిల్డర్స్ అధినేత కొంపల్లి గ్రామానికి చెందిన బూసిరెడ్డి పాండు రంగారెడ్డి మంగళవారం ఒక్కో ఆలయానికి రూ.1,05,116 చొప్పున మూడు ఆలయాలకు రూ. 3,15,000 లను మంగళవారం విరాళంగా అందించారు. ఈ సందర్భంగా పాండు రంగారెడ్డి మాట్లాడుతూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నిరుపేదలకు తన వంతుగా ఆర్థిక సాయం అందించడానికి ముందుంటానని హామీ ఇచ్చారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ దైవ భక్తిని అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ సందనర్భంగా పాండు రంగారెడ్డి ఆయా గ్రామాల ప్రజలు శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రంపోడు జెడ్పీటీసీ గాలి రవి కుమార్ గౌడ్, పెద్దవూర ఎంపీపీ గౌరవ సలహాదారులు చెన్ను సుందర్‌రెడ్డి, తిరుమలగిరి వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి, గుర్రంపోడు బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గుండెబోయిన కిరణ్, గుర్రంపోడు సర్పంచ్ సయ్యద్ మీయా, కొప్పోలు సర్పంచ్ లింగారెడ్డి, ఆర్ఎస్ఎస్ మండల అధ్యక్షుడు బల్గురి నగేష్, రామకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

కృష్ణయ్యకు నివాళి


నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చంద్రారెడ్డి

హాలియా : పట్టణంలో చిట్టిప్రోలు కర్ణసాగర్ తండ్రి చిట్టిప్రోలు కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హాలియా మున్సిపాలిటీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి పట్టణంలోని బాధిత నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢసానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా చిట్టిప్రోలు కృష్ణయ్య చిత్రపటానికి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ జూపల్లి శ్రీనివాస్, పిల్లి ఆంజనేయులు, తక్కెళ్ళపల్లి సైదులు తదితరులు ఉన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీఎల్‌ఆర్

అడవిదేవులపల్లి : మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేకుందుకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, సామాజికవేత్త బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్‌ఆర్) అన్నారు. మంగళవారం మండలంలోని వస్తంతండాలో శ్రీ వీరాంజనేయస్వామి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ముందుగా స్వామివారికి బీఎల్‌ఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించి లడ్డూ ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులందరూ కలిసి స్వామివారి వార్షికోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, కాంగ్రెస్ యువనేత సిద్దునాయక్, బండి నాగేశ్వర్‌రావు, మల్లిఖార్జున్ తదితరులున్నారు.

హోరాహోరీగా సీఎం కప్ క్రీడా పోటీలు


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మాడుగులపల్లి : మండల కేంద్రంలోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు మంగళవారం హోరాహోరీగా సాగాయి. కబడ్డీ సెమి ఫైనల్స్‌లో చెరువుపల్లి–పాములపాడు, వాలీబాల్‌లో తోపుచర్ల– పాములపాడు జట్లు తలపడ్డాయి. అథ్లెటిక్స్, ఖోఖో పోటీల్లో విజయం కోసం క్రీడాకారులు తీవ్రంగా శ్రమించారు. బుధవారం ఫైనల్స్ నిర్వహించి, విజయం సాధించిన జట్లకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. పోటీల్లో రాణించిన పలువురు క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీఓ దండ జితేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ నాయక్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నర్సింహ నాయక్, లక్ష్మణ్ నాయక్, పీఈటీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మె ఉధృతం


సమ్మెలో పాల్గొన్న వీఓఏలు

పెద్దవూర : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీఓఏల డిమాండ్లను నెరవేర్చకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దవూర మండల ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మె 30 రోజుల్లో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడారు. నెలోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం దున్న పోతు మీద వాన కురిసినట్లుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ సమ్మెలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చిలుముల దుర్గయ్య, వీఓఏల మండల కార్యదర్శి పాతబోయిన పద్మ, తరిబిక్షం, కళ్యాణి, సుజాత, విజయలక్ష్మీ, జయరాం , ధనలక్ష్మి, చందు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమాదేవి

హాలియా : ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణ పరిరక్షణకు పాడుపడుపడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు పరిధిలోని హాలియా–1 అంగన్‌వాడీ కేంద్రంలో పర్యావరణ పరిరక్షణపై తల్లులను నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్రతి ఒక్కరూ పేపర్ బ్యాగ్స్, జ్యూట్ బ్యాగ్స్ వాడాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల చాలా దుష్ఫలితాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాజ్యలక్ష్మి, ఆయా ఇందిరా, గర్భవతులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లలు, తల్లులు తదితరులు ఉన్నారు.

‘ఆదర్శ’లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిడమనూరు : స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశానికి మంగళవారం నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రంజిత తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికలు ఈనెల 25 వరకు ఎలాంటి ఫీజు లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున ఉంటాయన్నారు.

వేములపల్లి : పదో తరగతి పాసైన విద్యార్థులకు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అయాజ్‌ఖాన్ మంగళవారం తెలిపారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో 40 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 25లోపు ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు


హోమంలో పాల్గొన్న భక్తులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న నాభిశిల ప్రతిష్ఠాపన మహోత్సవాలు రెండో రోజు మంగళవారం కూడా కొనసాగాయి. దేశ గురువు శ్రీ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు దంపతుల సమేతంగా పూజల్లో పాల్గొన్నారు. 1వ వార్డు మెంబర్ ఎలిమినేటి సాయి తన వార్డు పరిధిలోని ఆడపడుచులకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, పస్నూరి యుగంధర్‌రెడ్డి, నాయిని మాధవరెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, పురోహితులు గణపతిశర్మ, శివయ్య శర్మ, జయప్రకాశ్ శర్మ వార్డు సభ్యుడు కొడిదాల వెంకటయ్య, జబ్బు వెంకటయ్య, బోడ నరేశ్, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నల్లగొండ టూటౌన్ : పట్టణంలో చేపడుతున్న రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం నీలగిరి పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్ నుంచి పెద్ద బండ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ పనులను వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ పనులు నాణ్యతతో చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులను త్వరలోనే మంత్రి కేటీఆర్ ప్రారంభిస్తారని, పనులు సకాలంలో పూర్తి చేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరన్ కేవీ. రమణాచారి, ప్రజారోగ్య శాఖ ఈఈ సత్యనారాయణ, మున్సిపల్ ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్, పాల్గొన్నారు.

ఓటును తాకట్టు పెట్టొద్దు

నల్లగొండ టౌన్ : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తాకట్టు పెట్టవద్దని ప్రజాస్వామ్య ఫోరం జిల్లా కన్వీనర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ కోరారు. మంగళవారం స్థానికంగా జరిగిన ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు అనే ఆయుధాన్ని దుర్వినియోగం చేయవద్దని కోరారు.